క్లుప్తంగా

19న అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ వేడుకలు

బి.కొత్తకోట : ఈనెల 19న విజయవాడంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణను పురస్కరించుకుని బి.కొత్తకోట నగర పంచాయతీలో వేడుకలను నిర్వహిస్తున్నట్టు కమిషనర్ పీఆర్.మనోహర్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు విగ్రహ ఆవిష్కరణకు ముందుగా సచివాలయాల్లో ఘనంగా వేడుకలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు, ముఖ్యులను ఆహ్వానించి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పాఠశాలల విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖనం, చర్చలు, క్విజ్ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు.

చిరుద్యోగులకు సంక్రాంతి కానుక



సంక్రాంతి కానుక అందిస్తున్న ఎంఈఓలు

బి.కొత్తకోట : బి.కొత్తకోట ఎమ్మార్సీ, సీఆర్పీలుగా పనిచేస్తున్న చిరు ఉద్యోగులు పది మందికి మంగళవారం రూ.1.05 లక్షల విలువైన నిత్యావసరాలను సంక్రాంతి కానుకగా ఎంఈవో రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారీలు అందించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అందించిన విరాళంతో వీటిని అందజేశారని తెలిపారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

బి.కొత్తకోట : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును తిరిగి పునరుద్ధరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సలీంబాషా డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను విడుదల చేయాలని కోరారు. భవన నిర్మాణ రంగం కుదేలైందని, కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బాలకృష్ణ, గఫూర్, రమేష్, శ్రీనివాసులు, బావాజాన్, ఖాముషా పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

కేవీపల్లె : మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి తెలిపారు. ఉపాధి హామీ పనులను గత నెల 26వ తేదీ నుంచి నుంచి క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్లు చెప్పారు. బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే సామాజిక తనిఖీ బహిరంగ సభలో తనిఖీ బృందం సేకరించిన నివేదికను గ్రామాల వారీగా అధికారుల ముందు చదివి వినిపిస్తారని తెలిపారు.

నేడు ఆడుదాం ఆంధ్రా పోటీలు

కలికిరి : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం ఉదయం నుంచి మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జరుగుతాయని ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. మండల స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు పోటీలు జరుగుతాయని, మండల స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరవ్వాలని ఆయన కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణంలో బుధవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సద్రీన్ ముక్తియార్ అన్నారు. ఉదయం 9గంటలకు స్థానిక ఇందిరమ్మ కాలనీనుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని ఆయన పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

సారా ఊట ధ్వంసం



మహిళ అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

ములకలచెరువు : ములకలచెరువు సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం మండలం రామానాయక్ తండా పరిసర ప్రాంతంలో నాటు సారా వండుతున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలసి మంగళవారం దాడులు నిర్వహించినట్లు సీఐ మల్లిక తెలిపారు. దాడుల్లో 800 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు తెలిపారు. మరో కేసులో ఎస్‌హెచ్ తండాకు చెందిన ఎం.జయమ్మ (59) నాటు సారా విక్రయిస్తుండగా ఆమె నివాసంలో దాడులు నిర్వహించి 12 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అనంతరం నిందితురాలిని రిమాండ్‌కు పంపామన్నారు.

ప్రతి ఊరిలో రూ. కోటి విలువ చేసే భవనాలు

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి
- ఇచ్చిన మాట నిలువుకున్న ప్రభుత్వం
- సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నవాజ్‌బాషా



వెంగంవారిపల్లెలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : స్వాతంత్య్రం వచ్చిన 76 ఏళ్లలో ఊళ్లో పంచాయతీ ఆఫీసు, పాడుబడిన ప్రభుత్వ బడి ఉంటే... జగనన్న పాలనలో ప్రతి ఊళ్లో గ్రామసచివాలయం, రైతుభరోసా కేంద్రం, విలేజ్‌క్లినిక్, నాడు–నేడుతో రూపురేఖలు మారి ఇంగ్లిష్ మీడియం చదువులు చెప్పే ప్రభుత్వ పాఠశాల.. ఇలా ప్రతి ఊరిలో రూ.కోటికిపైగా విలువచేసే భవనాలు వచ్చాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. ఇవన్నీ ప్రభుత్వ ఆస్తులని, 40 ఏళ్ల అనుభవం, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేశానని గొప్పలు చెప్పుకునే ప్రతిపక్షనేత చంద్రబాబు ఇందులో కనీసం ఒకవంతు ఆస్తినైనా ఎందుకు సృష్టించలేకపోయారో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. మంగళవారం నిమ్మనపల్లె మండలంలోని రాచవేటివారిపల్లెలో సచివాలయం, ఆర్‌బీకే, బండ్లపైలో సచివాలయం, వైఎస్సార్ విలేజ్‌క్లినిక్, సామకోటవారిపల్లెలో వైఎస్సార్ క్లినిక్, వెంగంవారిపల్లె, నిమ్మనపల్లెలో సచివాలయం, ఆర్‌బీకే కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.... ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 100శాతం నిలబెట్టుకున్నారన్నారు. ప్రతి ఇంటిలో సంక్షేమం వెల్లివిరిసేలా దేశంలోనే పెద్దమొత్తంలో రూ.3వేలు పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశేనని అన్నారు. కుల, మత, రాజకీయపార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల్లోని ప్రజలకు లబ్ధి కలిగేలా సంక్షేమ పథకాలు అమలుచేయడం జరుగుతోందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ నేతలు లేనిపోని మాయమాటలు చెప్పి, మోసం చేసేందుకు సిద్ధమవుతారని, వారి మాటలను నమ్మవద్దన్నారు. నాలుగున్నరేళ్లగా నీతినిజాయితీతో పాలన సాగిస్తున్న గొప్ప ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికలప్పుడు హామీలు ఇవ్వడమే తప్ప వాటిలో 10శాతం కూడా నెరవేర్చిన దాఖలాలు లేవని విమర్శించారు. అప్పటి టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం కావాలంటే రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించాలని కోరారు. బడుగు, బలహీనవర్గాలకు న్యాయం జరగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సదాశివరెడ్డి, గారబురుజు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, సర్పంచులు సుబ్రహ్మణ్యం, మహదేవరెడ్డి, పాపులమ్మ, చంద్రాయుడు, శ్రీదేవి, ఉషారాణి, ఎంపీటీసీ రెడ్డివెంకటేష్, నాయకులు నవీన్, చంద్ర, దయాకర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, నూర్‌మొహిద్దీన్‌ఖాన్, బొట్టురమణ, మహమ్మద్ రఫీ, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకు గ్రామ స్వరాజ్యం

- మళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపించుకుందాం
- ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



కందుకూరులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం : సంక్షేమ పథకాల ప్రదాత, గ్రామ స్వరాజ్యాన్ని ప్రజల ముంగిటకే తీసుకొచ్చిన జగనన్నను మనమంతా కలసి కట్టుగా మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మండలంలోని కందుకూరు, కాట్నగల్లు పంచాయతీల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. సంక్షేమ పాలన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సే ఆయన లక్ష్యమన్నారు. గత నాయకుల పాలనలో నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేసారని, వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అవధుల్లేని ఆనందం

మండలంలోని కందుకూరుకు చెందిన తలారి శాంతమ్మ అనే మహిళకు చెవులు పూర్తిగా వినబడవు. మాటలు కూడా సరిగా రావు. ఈమె దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయాలని గతంలో పల్లెబాటకు వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యేను వేడుకుంది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సదరు మహిళకు సదరన్ క్యాంపులో వికలత్వ ధ్రువీకరణ మంజూరు చేయడంతో కొత్తగా వికలాంగ పెన్షన్ మంజూరైంది. ఈ తరుణంలో మొదటి సారిగా వచ్చిన రూ.3 వేల పెన్షన్ సొమ్మును బుధవారం గడప, గడపలో భాగంగా ఎమ్మెల్యే మహిళకు అందజేయగా సదరు మహిళ అవధుల్లేని ఆనందాన్ని వ్యక్త పరిచింది.

నేడు తుమ్మరకుంట, నవాబుకోట పంచాయతీల్లో..

మండలంలోని తుమ్మరకుంట, నవాబుకోట పంచాయతీల్లో గురువారం గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల నాయకులు తెలిపారు.

బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

అడ్మిషన్ క్యాంపైన్‌లో అధ్యాపకులు



అడ్మిషన్ క్యాంపెయిన్‌లో భాగంగా ప్రచారం చేస్తున్న బీటీ కళాశాల అధ్యాపకులు

మదనపల్లె : వందేళ్ల ఘనచరిత్ర కలిగి, ఎందరినో ఉన్నత విద్యావంతులుగా, గొప్ప రాజకీయవేత్తలుగా, ముఖ్యమంత్రులుగా, సర్వోన్నత న్యాయమూర్తులుగా తీర్చిదిద్దిన బిసెంట్ థియోసఫికల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి, తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాల్సిందిగా కళాశాల అధ్యాపకులు కోరారు. అడ్మిషన్ క్యాంపైన్‌లో భాగంగా మంగళవారం గుర్రంకొండ, కలిచెర్ల, తంబళ్లపల్లెలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి అక్కడి విద్యార్థులను కలుసుకుని బీటీ కళాశాలలో చేరాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం మాట్లాడుతూ బీటీ కాలేజీ ప్రస్తుతం పూర్తిగా ప్రభుత్వంలో విలీనమైందని, కళాశాలలో ప్రస్తుతం పూర్తిస్థాయిలో ప్రభుత్వ అధ్యాపకులు వచ్చి చేరారన్నారు. కళాశాలలో విద్యార్థుల వృద్ధికి దోహదం చేసే కోర్సులు, హాస్టళ్లు, తరగతి గదులు, అధునాతనమైన ల్యాబులు, విశాలమైన క్రీడామైదానాలు, లక్షపుస్తకాలతో అతిపెద్ద లైబ్రరీ, ఎన్.ఎస్.ఎస్., ఎన్‌సీసీ, ఉద్యోగ నైపుణ్యాల శిక్షణ తదితరాలపై వివరించారు. బీటీ ప్రభుత్వ కాలేజీని యూనివర్సిటీ చేసేందుకు చర్యలు జరుగుతున్నాయన్నారు. మదనపల్లెలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. క్యాంపెయిన్‌లో అధ్యాపకులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్.మలిగిరాఘవరెడ్డి, ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్.గన్నవరం శ్రీదేవి, బాటనీ అధ్యాపకులు డాక్టర్.శైలజ, వైస్ ప్రిన్సిపాల్ డా.డేరంగులశ్రీనివాసులు, కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్.జి.చిన్నారెడ్డి పాల్గొన్నారు.

గుర్రంకొండలో ఆక్రమణలు తొలగింపు

బందోబస్తు నడుమ చర్యలు



గుర్రంకొండలో అక్రమ కట్టడాలను జేసీబీతో తొలగిస్తున్న అధికారులు

గుర్రంకొండ : పట్టణంలోని జీవన్‌తోపు రోడ్డు కిరువైపులా నెలకొన్న ఆక్రమణలను రెవెన్యూ, పోలీస్ అధికారులు జేసీబీలతో తొలగించారు. జీవన్‌తోపు రోడ్డు మార్గంలో రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వేనెంబర్ 127లో 3.56 ఎకరాల రాస్తా పోరంబోకు స్థలం ఉంది. గత కొన్నేళ్లగా ఈ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. పలువురు రోడ్డుకిరువైపులా ఉన్న ఈ స్థలాల్లో ఇళ్ల నిర్మించుకొన్నారు. రెండు సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఈ ఆక్రమణల విషయమై లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ మహబూబ్‌చాంద్ ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఆక్రమణలు నిజమేనని తేల్చారు. ఆక్రమణ దారులకు నోటీసులు కూడా అప్పట్లో జారీ చేశారు. ఇటీవల మూడునెలలుగా పలుమార్లు అధికారులు ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేశారు. వీరిలో కొంతమంది కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకొన్నారు. మరికొంతమంది కోర్టుకు వెళ్లలేదు. ఆక్రమణలను ఈనెల 31 తేదీలోగా తొలగించాలంటూ జిల్లా కలెక్టర్‌కు లోకాయుక్త నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈనేపథ్యంలో మంగళవారం తహసీల్దార్ ఖాజాబీ, ఎస్ఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం స్థానిక పాత గ్రామీణ బ్యాంకు భవనం నుంచి జేసీబీలతో ఆక్రమణ తొలగించే ప్రక్రియ చేపట్టారు. అయితే కొంతమంది టీడీపీ నాయకులు తొలగింపు ప్రక్రియను అడ్డుకొనేందుకు యత్నించారు. పోలీసులు వారిని చెదరగొట్టారు. అనంతరం రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలను అధికారులు ఎట్టకేలకు తొలగించారు. కోర్టుస్టే ఆర్డరు తెచ్చుకొన్న ఆక్రమణదారుల కేసు ఈనెల 29న లోకాయుక్తలో విచారణ జరపనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆరోజు వచ్చే తీర్పును బట్టి మిగిలిన ఆక్రమణలను కూడా తొలగిస్తామని వారు పేర్కొన్నారు.

వేడుకగా శ్రీ సప్పలమ్మ దేవతా విగ్రహ ప్రతిష్ట

మదనపల్లె : మండలంలోని సీటీఎం క్రాస్‌రోడ్‌లోని శ్రీ సప్పలమ్మ దేవతా విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈనెల 8న కలశస్థాపన, గణపతిపూజతో ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ట వేడుకలు మంగళవారం నూతన విగ్రహ జలాధివాసం, అంకురారోపణం, అగ్నిప్రతిష్ట ప్రతిస్థిత దీక్షా హోమ నూతన విగ్రహ ధాన్యాధివాసం జరిగింది. బుధవారం ఉదయం 6 గంటల నుంచి ప్రాతఃకాల పూజ, నూతన విగ్రహ మహాస్నపన అభిషేకం, యంత్ర ప్రతిష్ట విగ్రహ ప్రతిష్ట, మహాపూర్ణపూజలతో సప్పలమ్మ దేవతామూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ బండపల్లిఈశ్వరమ్మ, అక్కులప్ప తెలిపారు.

ప్రతి ఇంటికి శ్రీరామపూజిత అక్షింతలు



అక్షింతలు పంపిణీ చేస్తున్న రామభక్తులు

పీలేరు : ప్రతి ఇంటికి శ్రీరామపూజిత అక్షింతలు చేర్చడానికి కృషి చేస్తామని ఆర్ఎస్ఎస్ నాయకులు శశిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పద్మావతినగర్‌లో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న ఆయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం, ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఆ రోజును ప్రతి ఒక్కరూ ఒక దీపావళి పండుగలాగా చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, మురళీ, సుధాకర్‌రెడ్డి, నవీన, పలువురు మహిళా భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై ప్రభుత్వం సానుకూలం



మాట్లాడుతున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు చిన్నమ్మ

పీలేరు : అంగన్‌వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, కార్యకర్తలందరూ విధుల్లోకి రావాలని అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు చిన్నమ్మ కోరారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధులు నిర్వహిస్తూ మన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లవచ్చునని తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీలు స్వార్థ ప్రయోజనాల కోసం అంగన్‌వాడీ కార్యకర్తలను తప్పుదోవ పట్టిస్తున్నారని, వారి ఉచ్చులో పడరాదని కోరారు. గత ప్రభుత్వంలో జీతాలు పొందాలంటే ధర్నాలు చేయాల్సి వచ్చేదని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ప్రతి నెలా జీతాలు అందిస్తోందని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వర్కర్లకు రాత పరీక్ష ద్వారా 560 మంది ప్రమోషన్లు కల్పించిందని గుర్తు చేశారు. గర్భవతులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్క అంగన్‌వాడీ కార్యకర్త తక్షణం విధుల్లోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, ఆరీఫా, రోజారాణి, అన్నపూర్ణ, సంపూర్ణ, రెడ్డెమ్మ, చంద్రకళ, అనిత, విజయ, మంజుల, కళావతి, శాంత తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే అణగారిన వర్గాలకు ప్రాధాన్యత



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వాల్మీకిపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనతోనే అణగారిన వర్గాలకు సమ ప్రాధాన్యత లభిస్తోందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, మండల వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచలోనే ఎక్కడా లేని విధంగా విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల ఎత్తు గల బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో సీఎం జగన్మోహన్‌రెడ్డి అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని ఎవరెస్టు శిఖరం ఎత్తుకు తీసుకెళ్లారని కొనియాడారు. గతంలో కాంగ్రెస్, టీడీపీ పరిపాలనలో అణగారిన వర్గాలకు అన్యాయం చేశారన్నారు. 19న విజయవాడలో జరిగే అంబేడ్కర్ విగ్రహా విష్కరణ కార్యక్రమానికి పీలేరు నియోజకవర్గంలో నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, సుధాకర్, శివయ్య, ఖాద్రీ, సమీ, విశ్వనాథ్, సురేంద్ర రెడ్డి, ఈశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్న సర్పంచ్ జీనత్‌షఫీ తెలిపారు. స్థానిక కొత్తపల్లె రోడ్డులో కొత్తగా బోరు డ్రిల్లింగ్ చేసి, మోటారు అమర్చారు. బుధవారం బోరుకు పూజలు చేసి నీరు వదిలారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కొత్తగా వేసిన రెండు బోర్లలో నీరు పుష్కలంగా రావడంతో పట్టణంలోని పలు ప్రాంతాలకు నీరు అందుతుందని తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎ.ఎస్. హుమయూన్, కూనా సత్యం తదితరులు పాల్గొన్నారు.

తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతీమా జయంతి



ఫాతీమా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

పీలేరు రూరల్ : ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి వేడుకలు మాల మహానాడు, అంబేడ్కర్‌సేన బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. ఫాతిమా చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు ధరణికుమార్, బలరాం మాట్లాడుతూ దేశంలో అతి శూద్రులు, శూద్రులుగా విభజించబడి విద్యకు దూరం చేయబడిన సామాజిక వర్గాలను, అందులోనూ బాలికలను విద్యావంతుల్ని చేయడానికి మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయా పూలే ఉద్యమించారన్నారు. పూలే స్థాపించిన పాఠశాలలో ఫాతిమా షేక్ ప్రధానోపాధ్యాయినిగా బాధ్యతలు చేపట్టి పలువురిని విద్యావంతుల్ని చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గట్టప్ప, మల్లికార్జున, ఆనంద్, సుభాష్, లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రక్షణ కవచంలా ఆరోగ్యశ్రీ

రామసముద్రం : ఆర్థిక స్థోమత లేని పేదలకు అనారోగ్యానికి గురైతే వారికి రక్షణ కవచంలా వైఎస్సార్ సీపీ ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని మరింత పెంచుతూ ప్రభుత్వం ముందుకు అడుగులు వేసిందని ఎంపీడీఓ నారాయణస్వామి తెలిపారు. మంగళవారం ఆయన సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఆరోగ్యశ్రీ క్రింద గతంలో ఒక కుటుంబానికి రూ.5 లక్షలు ఉన్న పథకాన్ని ప్రస్తుతం రూ.25 లక్షలకు పెంచి ప్రజలకు రక్షణగా నిలబడిందన్నారు. మండలంలో సుమారు 13 వేల కుటుంబాలకు మొదటి విడతగా 4103 కుటుంబాలకు హెల్త్ కార్డులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి



రిషి ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డాక్టర్ లోకవర్ధన్

పీలేరు : ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహించాలని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక రిషి నెట్‌వర్క్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రమాణాలకు తగినట్లు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అత్యవసర సమయంలో 24 గంటలు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. శస్త్ర చికిత్స అనంతరం ఇస్తున్న ఆరోగ్య ఆసరా లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతుందా లేదా, రోగులకు అందిస్తున్న ఆహారం, నీరు నాణ్యత గూర్చి అడిగితెలుసుకున్నారు. డిశ్చార్జ్ సమయంలో రోగులకు బస్ చార్జీ డబ్బులు, సరిపడా మందులు, ఆరోగ్య మిత్ర నడవడిక తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సచివాలయ భవనాలు ప్రారంభోత్సవం

రామసముద్రం : మండలంలోని పలు సచివాలయాలు,ఆర్‌బీకేలు , హెల్త్ సెంటర్లను బుధవారం ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రారంభించనున్నట్లు మండల కన్వీనర్ నందకిషోర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు మండలంలోని మాలేనత్తం రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, 9:30 గంటలకు కుదురుచీమనపల్లె గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, మినికి సచివాలయం, రైతుభరోసా కేంద్రం, చొక్కాండ్లపల్లి రైతు భరోసా కేంద్రం, ఊలపాడు గ్రామ సచివాలయం, రామసముద్రం –2 గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తారు అలాగే ఆర్.నడింపల్లి రైతు భరోసా కేంద్రం, పాలశీతలికరణ కేంద్రం (బిఎంసీ), పెద్దకురప్పల్లె గ్రామ సచివాలయం, కాప్పెల్లి రైతు భరోసా కేంద్రం, చెంబకూరు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, కమ్మవారిపల్లె గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ పార్టీ అనుబంధ సంఘాల కన్వీనర్లు, గృహసారధులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎస్‌టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ

బి.కొత్తకోట : ఎస్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్స క్యాలెండర్లు, డైరీలను స్థానిక ఎమ్మార్సీలో ఎంఈవోలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారీలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సామాజిక సమతా సంకల్పం

మదనపల్లె : అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణను పురస్కరించుకుని మండలంలోని గ్రామసచివాలయాల్లో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సీటీఎం, రేగంటివారిపల్లె, కొత్తవారిపల్లె, పోతపోలు, కొండామద్రిపల్లె, బసినికొండ, కొత్తపల్లె-1, బొమ్మనచెరువు, వేంపల్లె గ్రామసచివాలయాల్లో సర్పంచులు, సచివాలయ సెక్రటరీ, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సచివాలయ స్థాయిలో పాఠశాల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రతి సచివాలయం నుంచి 5 మంది సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సర్పంచులు దండుకరుణాకర్‌రెడ్డి, సెక్రటరీలు పి.పద్మకుమారి, శ్రీకాంత్, షర్ఫుద్దీన్, విష్ణువర్ధన్, రవీంద్రనాయక్, షాబాద్, గిరిధర్‌నాయక్, మనోహర, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

12న ముందస్తు సంక్రాంతి సంబరాలు

ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా ఈనెల 12న మదనపల్లె జెడ్పీహైస్కూల్ మైదానంలో మదనపల్లె ముందస్తు సంక్రాంతి సంబరాల వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ ఎం.ఎస్.మురళి తెలిపారు. మంగళవారం సబ్ కలెక్టరేట్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాల కార్యక్రమ కార్యాచరణపై మున్సిపల్, రెవెన్యూ, కళాశాలల ప్రతినిధులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, కళాకారులు తదితరులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. సంక్రాంతి ముందస్తు సంబరాలకు హాజరయ్యే ప్రజలు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలన్నారు. సంక్రాంతి వేడుకల్లో గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా, సంప్రదాయాన్ని గుర్తుచేసేలా ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.